సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
సోమవారం । 18 । డిసెంబర్ । 2023



నిజరూపంలో కనకమహాలక్ష్మి

విశాఖ: మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం నిజరూపంలో ఉన్న అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు.



జూకు భారీగా ఆదాయం

విశాఖ జంతు ప్రదర్శనశాలను ఆదివారం 8,550 మంది సందర్శించగా రూ.6.84 లక్షల ఆదాయం వచ్చింది.



ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు

విశాఖ: ఇస్కాన్ మందిరంలో రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుని విగ్రహాలను పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

న్యూస్‌రీల్

వణికిస్తున్న చలిగాలులు

- తగ్గుముఖం పడుతున్న ఉష్ణోగ్రతలు
- అరకులో 11.8, మినుములూరులో 12, చింతపల్లిలో 15.5 డిగ్రీల నమోదు



పాడేరు రోడ్డులో కురుస్తున్న మంచు

సాక్షి, పాడేరు: జిల్లా వ్యాప్తంగా చలితీవ్రత నెలకొంది.సాయంత్రం ఐదుగంటల నుంచే చలి వణికిస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గిరిజన గ్రామాల్లో చలిమంటలను ఆశ్రయిస్తున్నారు. ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడుతున్నాయి. పొగమంచు దట్టంగా కురుస్తోంది. అరకులోయ కేంద్ర కాఫీబోర్డులో ఆదివారం 11,8 డిగ్రీలు, పాడేరు మండలం మినుములూరు కేంద్రకాఫీబోర్డులో 12డిగ్రీలు, చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 15.5 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదైనట్టు అధికారవర్గాలు తెలిపాయి.

డోలీలో తరలింపు



డోలీలో మోసుకువస్తున్న కుటుంబ సభ్యులు

అనంతగిరి: మండలంలోని మారుమూల పినకోట పంచాయతీ రాచకీలం గ్రామానికి చెందిన సూకురు బాబూరావు(19)అనే యువకుడు రెండు రోజుల క్రితం అనారోగ్యానికి గురయ్యాడు. గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో అతనిని రాచకీలం నుంచి బల్లగరువు సుమారు ఏడు కిలోమీటర్లు డోలీలో కుటుంబ సభ్యులు మోసుకువచ్చారు. అక్కడ నుంచి ఆటోలో దేవరాపల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. బాబూరావు ఆరోగ్యం మెరుగుపడటంతో ఆదివారం స్వగ్రామానికి డోలీలో మోసుకుని తీసుకువచ్చారు.

పోలీసు, అటవీశాఖ అధికారుల ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్



బ్యాటింగ్ చేస్తున్న రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ అడహళ్ల

రంపచోడవరం : స్థానిక ఏపీఆర్ కళాశాల మైదానంలో ఆదివారం పోలీస్, అటవీశాఖ అధికారులు ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. ఏఎస్పీ జగదీష్ అడహళ్లి, డీఎఫ్‌వో నరేంద్రియన్, సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ మోహన్ కుమార్ తదితరులు మ్యాచ్ ఆడారు. పోలీసు శాఖపై అటవీశాఖ జట్టు విజయం సాధించింది. రేంజి అధికారి ఆజాద్ పాల్గొన్నారు.

ఆరుగురు పందెంరాయుళ్ల అరెస్టు



పట్టుబడిన పందెంరాయుళ్లతో ఎస్ఐ రవీంద్ర, సిబ్బంది

ముంచంగిపుట్టు: మండలంలోని జర్జుల పంచాయితీ గుర్రాలబయలు గ్రామ సమీపంలో కోడిపందాల శిబిరంపై ఆదివారం సాయంత్రం పోలీసులు దాడులు నిర్వహించారు. ఆరుగురిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ రవీంద్ర తెలిపారు. గుర్రాలబయలు గ్రామ సమీపంలో గుట్టుచప్పుడు కాకుండా కోడిపందేలు నిర్వహిస్తున్నారని పక్కా సమాచారం మేరకు సిబ్బందితో దాడులు నిర్వహించామని ఎస్ఐ పేర్కొన్నారు. పట్టుబడిన నిందితుల నుంచి 3,200 నగదు, మూడు పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో దారెల పంచాయతీ కేంద్రానికి చెందిన చెండా సుబ్రమాణ్యం,మండి మోహన్‌రావు, జర్జుల పంచాయతీ టంకాపుట్టు గ్రామానికి చెందిన సబడ రామారావు,బలడ గ్రామానికి చెందిన కిల్లో రాము,జర్రెల పంచాయతీ డేగలపుట్టు గ్రామానికి చెందిన గుంట గోపాల్, వనభసింగి పంచాయతీ తడపల్లి గ్రామానికి చెందిన కిల్లో చైతన్య ఉన్నారని ఎస్ఐ వెల్లడించారు.

రబ్బరు సాగు విస్తరించేనా!

- ఏజెన్సీలో అనుకూల వాతావరణం
- ఇప్పటికే మంచి దిగుబడి సాధిస్తున్న రైతులు
- కేంద్ర మంత్రిత్వశాఖ వద్ద ప్రతిపాదనలు
- మొక్కల కోసం ఏడాదిగా ఎదురుచూపు
- ప్రోత్సహిస్తే సిరులు

రంపచోడవరం డివిజన్‌లో రబ్బరు సాగుకు అనుకూల వాతావరణ పరిస్థితులు ఉన్నందున పోత్సాహం కోసం రైతులు ఆశతో ఎదురుచూస్తున్నారు. అందుకు తగ్గట్టుగా సాగు విస్తీర్ణం పెంచాలని రంపచోడవరం ఐటీడీఏ, రబ్బరు బోర్డులు ప్రతిపాదనలు చేశాయి. అయితే ఏడాదిగా కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ వద్ద పెండింగ్‌లో ఉంది. ఆమోదం వచ్చిన వెంటనే పెంపకం చేపడతామని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే సాగు చేస్తున్న రైతులు మంచి ఆదాయం పొందుతున్నారు.



రబ్బరు తయారీ



మారేడుమిల్లి ప్రాంతంలో రబ్బరు తోటలు (ఇన్‌సెట్) రబ్బరు చెట్టుకు ట్యాపింగ్ చేస్తున్న రైతు

రంపచోడవరం : మారేడుమిల్లి ప్రాంతంలో రబ్బరు సాగుకు ఐటీడీఏ, రబ్బరు బోర్డు సహకారంతో ఈ ప్రాంత గిరిజన రైతులు 1994లో శ్రీకారం చుట్టారు. ఈ ప్రాంత వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నందున మంచి దిగుబడి వస్తోంది. ఈ ప్రాంతం సముద్ర మట్టానికి ఎత్తుగా ఉన్నందున వాతావరణం చల్లగా ఉంటుంది. శీతల ప్రాంతం కావడంతో సాగును ప్రోత్సహించేందుకు రబ్బరు బోర్డు ముందుకు వచ్చింది. రంపచోడవరం కేంద్రం బోర్డు కార్యాలయాన్ని అదే సంవత్సరంలో ఏర్పాటు చేసింది.

దేవరపల్లి, పూజారిపాకల్లో..

మారేడుమిల్లి మండలం దేవరపల్లి గ్రామంలో 50 హెక్టార్లలో 36 మంది రైతులతో రబ్బరు మొక్కలు నాటించారు. కేరళ నుంచి మొక్కలను తీసుకువచ్చి రైతుల భూముల్లో నాటించిన బోర్డు అధికారులు కూలిరూపంలో కొంత మొత్తం చెల్లించి ప్రోత్సహించేవారు. మొక్కల పెరుగుదల బాగుండటంతో రబ్బరు బోర్డు బ్లాక్ ప్లాంటేషన్ పేరుతో పూజారిపాకల్లో 1999–2003 మధ్య 45 హెక్టార్లో 36మంది రైతులతో రబ్బరు మొక్కలు నాటించారు. మంచి ఫలితాలు వస్తున్నందున పందిరిమామిడి కోట గ్రామంలో కూడా 2009లో వంద హెక్టార్లలో మొక్కలు నాటించారు. ఏడేళ్ల తరువాత దిగుబడి ప్రారంభమైంది. రబ్బరు తయారీకి అవసరమైన రబ్బరు రోలింగ్ మెషీన్లు, స్మోక్ రూమ్‌ల ఏర్పాటుకు 50 శాతం రాయితీ కల్పిస్తూ రబ్బరు బోర్డు నిధులు వెచ్చించి ప్రోత్సహించింది. అప్పటి నుంచి రైతులు ఆన్‌లైన్ జాతీయ మార్కెట్లో ధరలు తెలుసుకుని వాటి ఆధారంగా విక్రయిస్తున్నారు. మంచి ఆదాయం పొందుతున్నారు.

మొక్కల లభ్యత లేక..

కొత్తగా రబ్బరు సాగు చేపట్టాలనుకునే రైతులకు నిరాశే మిగిలింది. కేరళలో మాత్రమే లభ్యమయ్యే మొక్కలను తీసుకువచ్చి నాటడం వ్యయంతో కూడినది కావడంతో రైతులు సాహసించలేకపోతున్నారు. ఐదు వేల హెక్టార్లలో రైతులతో సాగు చేపట్టేందుకు రంపచోడవరం రబ్బరు బోర్డు ఏడాది క్రితం కొట్టాయంలోని ప్రధాన కార్యాలయానికి ప్రతిపాదనలు పంపింది. రంపచోడవరం ఐటీడీఏ కూడా 500 హెక్టార్లలో రైతులతో సాగు చేపట్టేందుకు ఐదు నెలల క్రితం రబ్బరు బోర్డుకు ప్రతిపాదనలు పంపింది. ఇవన్నీ పెండింగ్‌లోనే ఉన్నాయి. దీనికి ఆమోదం లభిస్తే వై రామవరం, రంపచోడవరం, మారేడుమిల్లి ప్రాంతాల్లోని రైతులతో సాగు చేపట్టాలన్న ఆలోచనలో రబ్బరుబోర్డు అధికారులు ఉన్నారు.

రూ.2 లక్షల ఆదాయం



వేటుకూరు గ్రామంలో రెండు ఎకరాల రబ్బరు తోట ఉంది. 12 ఏళ్ల నుంచి మంచి ఆదాయం వస్తోంది. అప్పటి నుంచి ఏటా ఆదాయం పెరుగుతూ వస్తోంది. ప్రస్తుతం రూ. 2 లక్షల వరకు ఆదాయం పొందుతున్నా. జాతీయ మార్కెట్లో ధరను బట్టి ఆదాయం ఉంటుంది. ఇక్కడ రైతులు రబ్బరు సాగుపై ఎంతో ఆసక్తిగా ఉన్నారు. రబ్బరు మొక్కలు ఇస్తే రైతులు నాటుకుని పెంచుకుంటారు.

– కదల మొట్టిరెడ్డి, రబ్బరు రైతు, వేటుకూరు, మారేడుమిల్లి మండలం

రైతులకు ఉచిత శిక్షణ



రబ్బరు బోర్డు బ్లాక్ ప్లాంటేషన్ ద్వారా నాటిన రబ్బరు మొక్కలు ద్వారా రైతులు మంచి ఆదాయం పొందుతున్నారు. రబ్బరు ట్యాపింగ్, క్వాలిటీ షీట్ల తయారీపై సొసైటీ సభ్యులకు శిక్షణ ఇస్తున్నాం. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలపై అవగాహన కల్పిస్తున్నాం. ప్రతిపాదలనకు ఆమోదం లభిస్తే ఉచితంగా రబ్బరు మొక్కలను రైతులు పొందవచ్చు.

– శరత్ చంద్రమరండీ, అసిస్టెంట్ డెవలప్‌మెంట్ ఆఫీసర్, రబ్బరుబోర్డు, రంపచోడవరం

స్పందనలో దరఖాస్తులు



గిరిజన రైతులు రబ్బరు సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే చాలామంది మొక్కల కోసం ఐటీడీఏ స్పందనలో దరఖాస్తులు అందజేశారు. ఐటీడీఏ పీవో సూరజ్ గనోనే రబ్బరు సాగును ఉపాధి హామీ పథకంలో ప్రోత్సహించే దిశగా చర్యలు చేపట్టారు. 500 ఎకరాల్లో నాటేందుకు గిరిజన సంక్షేమశాఖ కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపారు. రబ్బరు రైతుల సొసైటీలకు రోలరు మెషీన్ల పంపిణీకి చర్యలు చేపట్టాం.

– కె.చిట్టిబాబు, ప్రాజెక్ట్ హార్టికల్చర్ అధికారి, ఐటీడీఏ, రంపచోడవరం

రామోజీరావు ప్రజలకు క్షమాపణ చెప్పాలి

రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి డిమాండ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

రాజవొమ్మంగి: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పాఠశాలలను అభివృద్ధి చేయడంతో పాటు విద్యార్థులకు ఇంగ్లీష్ మీడియంలో చదువులు చెబుతుంటే అసత్య కథనాలతో విష ప్రచారం చేస్తున్న ఈనాడు రామోజీరావు తక్షణం ప్రజలకు క్షమాపణ చెప్పాలని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ వాహనయాత్రలో భాగంగా రాజవొమ్మంగి మండలం బలిజపాడు గ్రామానికి విచ్చేసిన ఆమె విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో 5.50 లక్షల ట్యాబులను బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనారిటీ విద్యార్థులకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఉచితంగా అందజేశారన్నారు. దీనిపై రామోజీరావు బహిరంగ చర్చకు రావాలని సవాలు విసిరారు. పేదల కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలుచేయడాన్ని ఓర్చుకోలేని ఎల్లో మీడియా అసత్య ప్రచారం చేస్తోందని విమర్శించారు. రాబోయే రోజుల్లో ప్రజలే వారికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శింగిరెడ్డి రామకృష్ణ పాల్గొన్నారు.

'రుద్రాక్ష' కనువిందు



మోదకొండమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో ఆకట్టుకుంటున్న రుద్రాక్ష కాయలు

సాక్షి,పాడేరు: స్థానిక మోదకొండమ్మతల్లి ఆలయం,ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయ ప్రాంగణాల్లో రుద్రాక్ష చెట్లు కాయలతో ఆకట్టుకుంటున్నాయి. ఆయా ప్రాంగణాల్లో మూడేళ్ల క్రితం రెండు రుద్రాక్ష మొక్కలను నాటారు. ఇవి కాయలతో కనువిందు చేస్తున్నాయి.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



చింతపల్లిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్



సూచనలిస్తున్న పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



పంపిణీ చేసేందుకు ట్యాబ్‌లను సిద్ధం చేస్తున్న అధికారులు

చింతపల్లి రూరల్: మండల కేంద్రం చింతపల్లిలో ఈ నెల 21న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను ఆదివారం కలెక్టర్ సుమిత్‌కుమార్, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, చింతపల్లి అదనపు ఎస్పీ ప్రతాప్ శివకిశోర్, పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ పరిశీలించారు. దీనిలో భాగంగా చౌడుపల్లిలో హెలీప్యాడ్, పాడేరు డిగ్రీ కళాశాల మైదానంలో సభా ప్రాంగణం, గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ పాఠశాలలో ట్యాబ్‌ల పంపిణీ ఏర్పాట్లపై వారు సూచనలు చేశారు. బుధవారం నాడు జరిగే చింతపల్లి వారపు సంతను రద్దుచేయాలని ఆదేశించారు. ఈ విషయాన్ని పంచాయతీ అధికారులు పరిసర గ్రామాల ప్రజలు, వ్యాపారులకు తెలియజేయాలని వారు సూచించారు. ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేసేందుకు నేతలు, పార్టీ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీ ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు, మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నర్సింగరావు, డీపీవో కొండలరావు, డీఆర్‌డీఏ పీడీ మురళి, గిరిజన సంక్షేమశాఖ ఈఈ రాజు, డీఎల్పీవో కుమార్, ఎంపీడీవో ఆశాజ్యోతి, తహసీల్దార్ లచ్చాపాత్రుడు, ఏటీడబ్ల్యూవో నాగలక్ష్మి, ఎంఈవోలు ప్రసాద్, నాయుడు పాల్గొన్నారు.

పంపిణీకి ట్యాబ్‌లు సిద్ధం

ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా 8వ తరగతి విద్యార్థులకు అందించే ట్యాబ్‌లను సిద్ధం చేస్తున్నామని రాష్ట్ర ఐటీ సెల్ నోడల్ అధికారి సీహెచ్ యూజే రమేష్‌కుమార్ తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆదివారం సందర్శించిన ఆయన సిద్ధం చేస్తున్న ట్యాబ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 4,35,495 ట్యాబ్‌లను 8వ తరగతి విద్యార్థులకు అందజేయనున్నట్లు తెలిపారు. చింతపల్లి మండలంలోని 17 పాఠశాలల్లో 871 ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్నట్టు ఆయన వివరించారు. ఎంఈవో వనపల ప్రసాద్ ,రాష్ట్ర కమాండ్ కంట్రోల్ అధికారి వెంకటరావు పాల్గొన్నారు.

శిశు మరణాలపై నిపుణులతో అధ్యయనం

డీఎంహెచ్‌వో జమాల్‌బాషా



కిలుములు గ్రామంలో శిశు మరణాలపై వివరాలు తెలుసుకుంటున్న డీఎంహెచ్‌వో జమాల్‌బాషా

పెదబయలు: మండలంలో శిశుమరణాలపై వైద్యనిపుణుల బృందంతో అధ్యయనం చేస్తామని డీఎంహెచ్‌వో జమాల్‌బాషా తెలిపారు. ఆదివారం ఆయన మండలంలోని లక్ష్మీపేట పంచాయతీ కిలుములు, బల్లపురాయి,కుడాసింగి,లక్ష్మీపేట గ్రామాల్లో పర్యటించారు. శిశు మరణాలకు సంబంధించి వారి తల్లిదండ్రులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అందరూ ఒకేలా కాకుండా వేర్వేరు లక్షణాలతో ఆరుగురు మృతి చెందినట్టు వారు వివరించారు. శిశువుల ఆరోగ్యం, ఎదుగుదల బాగానే ఉందని డీఎంహెచ్‌వోకు వారు తెలిపారు. డీఎంహెచ్‌వోతోపాటు జిల్లా క్షయ నియంత్రణ అధికారి టి.విశ్వేశ్వరనాయుడు మాట్లాడుతూ శిశు మరణాలపై కలెక్టర్, ఐటీడీఏ పీవోకు నివేదిస్తామని చెప్పారు. వారం రోజులపాటు వైద్య శిబిరాలను కొనసాగించాలని, ఎవ్వరికి బాగులేకపోయినా వెంటనే పీహెచ్‌సీకి సమాచారం అందించాలని స్థానిక వైద్య సిబ్బందిని ఆదేశించారు. వైద్యాధికారులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు



పూర్వ విద్యార్థి సుందరరావు ఏకపాత్రాభినయ ప్రదర్శన

ముగిసిన స్వర్ణోత్సవ వేడుకలు

రాజవొమ్మంగి: స్థానిక అల్లూరి సీతారామరాజు జెడ్పీ ఉన్నత పాఠశాల స్వర్ణోత్సవాలు రెండో రోజు ఆదివారం ఘనంగా ముగిశాయి. వేర్వేరు చోట్ల స్థిరపడిన సుమారు మూడు వేల మంది పూర్వ విద్యార్థులు అంతా ఒక చోట చేరి ప్రేమానురాగాలను పంచుకున్నారు. తమ చిన్ననాటి స్నేహితులను కలిసిన ఆనందంలో మునిగితేలారు. గురువులతో కలసి సెల్ఫీలు తీసుకుని సందడి చేశారు. విద్యాబుద్ధులు నేర్పిన దాదాపు వంద మంది గురువులను స్వర్ణోత్సవ వేదికపై సత్కరించారు. ఘనంగా సన్మానించారు. అతిథులకు స్వర్ణోత్సవ కమిటీ విందు భోజనాలు ఏర్పాటు చేసింది. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పూర్వ విద్యార్థులను బ్యాచ్‌లు వారీగా వేదికపైకి ఆహ్వానించి జ్ఞాపికలు అందజేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

పర్యాటక ప్రాంతాల్లో సండే సందడి



బొర్రా గుహలను సందర్శించిన పర్యాటకులు



కొత్తపల్లి జలపాతానికి పోటెత్తిన సందర్శకులు

సాక్షి, పాడేరు: జిల్లాలోని పర్యాటక ప్రాంతాలు ఆదివారం కిక్కిరిశాయి. తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన పర్యాటకులు భారీగా తరలివచ్చారు. ప్రభుత్వ, ప్రైవేట్ రిసార్ట్‌లు, హోటళ్లు నిండిపోయాయి. చలి వేణికిస్తున్నా ప్రకృతి అందాలను తిలకించేందుకు ప్రాధాన్యమిచ్చారు. ఇక్కడి సమీపంలోని వంజంగి హిల్స్‌కు తెల్లవారుజాము నాలుగు గంటలకు సెల్‌ఫోన్ వెలుగులో పర్యాటకులు చేరుకున్నారు. సూర్యోదయం, పొగమంచు అందాలను తిలకించారు.

అనంతగిరి: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రాగుహలకు ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. శనివారం నాలుగు వేల మంది తిలకించగా రూ.4 లక్షలు, ఆదివారం 8వేల మంది తిలకించగా రూ.6లక్షల ఆదాయం వచ్చింది. సందర్శిత ప్రాంతాలైన తాటిగూడ, సరియా, కటిక, చిట్టంపాడు జలపాతాలు పర్యాటకులతో కళకళలాడాయి. డముకు, గాలికొండ వ్యూపాయింట్ వద్ద పర్యాటకులు సందడి చేశారు.

చెరువులవేనంలో..

చింతపల్లి రూరల్: లంబసింగి, చెరువులవేనం, తాజంగి ప్రాంతాల్లో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. ఇటీవల కొద్దిరోజులపాటు మిచాంగ్ తుపాను కారణంగా మన్యంలో మంచు, ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టడంతో పర్యాటకుల రాక తగ్గింది. ప్రస్తుతం మంచు కురుస్తుండటంతో ప్రకృతి అందాలను తిలకించేందుకు భారీగా తరలివచ్చారు.

సహజ సిద్ధ అందాలను తిలకిస్తూ..

అరకులోయ రూరల్: మండలంలోని మాడగడ సన్‌రైజ్ వ్యూ పాయింట్‌కు పర్యాటకుల తాకిడి పెరిగింది. ఆదివారం ఈప్రాంతానికి భారీగా తరలివచ్చారు. వేకువ జామునుంచి సహజసిద్ధ అందాలను తిలకించారు. సెల్ఫీలు, ఫొటోలు తీసుకుని సందడి చేశారు.

జలపాతంలో స్నానాలు చేస్తూ..

జి.మాడుగుల: మండలంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతం కొత్తపల్లి జలపాతానికి ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు పోటెత్తారు. రెండు కొండల మధ్య బండరాళ్లపై జాలువారుతున్న జల ప్రవాహంలో స్నానాలు చేస్తూ సందడి చేశారు. ఫొటోలు, సెల్ఫీలు దిగుతూ ఉత్సాహంగా గడిపారు.

దుంబ్రిగుడ: ప్రముఖ పర్యాటక ప్రాంతాలైన చాపరాయి జలపాతం, అంజోడా సిల్క్‌ఫారం, కొల్లాపుట్టు ప్రాంతాలు ఆదివారం పర్యాటకులతో సందడిగా మారాయి. మైదాన ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చారు. ప్రకృతి అందాలను తిలకిస్తూ ఉత్సాహంగా గడిపారు.




చెరువులవేనం కొండపై అందాలను తిలకిస్తున్న పర్యాటకులు



వంజంగి హిల్స్‌లో పొగమంచు అందాలను వీక్షిస్తున్న సందర్శకులు



మాడగుడ కొండ ప్రాంతంలో సందడి చేస్తున్న పర్యాటకులు



మంచు అందాలు తిలకిస్తున్న సందర్శకులు

క్లుప్తంగా

సినీనటి జయసుధకు సత్కారం



జయసుధను సత్కరిస్తున్న రాగమయి సాంస్కృతిక సంగీత సంస్థ, పలువురు ప్రముఖులు

డాబాగార్డెన్స్: ప్రముఖ సినీనటి జయసుధను రాగమయి సాంస్కృతిక సంగీత సంస్థ ఘనంగా సత్కరించింది. డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా ఆదివారం 'ఈ రోజు మంచి రోజు..మరుపురాని మధురమైనది' పేరిట నిర్వహించిన సినీ సంగీత విభావరిలో సంస్థ అధ్యక్షురాలు కందర్ప రాధ, పలువురు ప్రముఖులు సత్కరించారు. అనంతరం నిర్వహించిన సంగీత విభావరి ప్రేక్షకుల్ని అలరించింది. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షుడు జేఎమ్ఆర్ నెహ్రూ, కార్యదర్శి ఎమ్ త్రినాధ్, కన్వీనర్ విజయరమణి తదితరులు పాల్గొన్నారు.

సిద్ధమవుతున్న ఎన్ఎస్టీఎల్ ప్రదర్శనశాల



ప్రదర్శనశాల ఏర్పాటు చేసేది ఇక్కడే

విశాఖ విద్య: విశాఖ నగరంలోని ఎన్ఏడీ దరి నావికా విజ్ఞాన, సాంకేతిక ప్రయోగశాల(ఎన్ఎస్టీఎల్) వద్ద బుచ్చిరాజుపాలెం సెంటర్‌లో అందరినీ ఆకట్టుకునేలా ప్రదర్శన శాల సిద్ధమౌతుంది. ఎన్ఎస్టీఎల్ గేటు ముందు మూడు రోడ్ల సెంటర్‌లో దీనిని ఏర్పాటు చేస్తున్నందున 'ట్రైడెంట్'గా దీన్ని ప్రాచుర్యంలోకి తీసుకొచ్చేలా పనులు వేగవంతం చేశారు. డీఆర్డీవో ప్రయోగశాలలో ఉండే వివిధ మిషనరీల ప్రతిబింబాలను ఇక్కడ ఏర్పాటు చేయనున్నారు. 35 అడుగుల మేర షిప్‌ను కూడా ఇక్కడ పెట్టనున్నారు. బెంగళూరు, చెన్నై, హైదరాబాద్‌లలో మాత్రమే ఇలాంటి ప్రదర్శనశాలలు ఉండగా, ప్రస్తుతం విశాఖ ఎన్ఎస్టీఎల్ ముందు కూడా అదే రీతిన అందుబాటులోకి తీసుకొచ్చేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. విద్యార్థులు, సైన్స్ సంబంధిత ప్రయోగాల వైపు వెళ్లే వారికి ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పనులు పర్యవేక్షణ చేస్తున్న ఓ అధికారి తెలిపారు.

ఉల్లాసంగా వైజాగ్ మారథాన్



ఆర్కే బీచ్ జనసంద్రం : రన్‌లో పాల్గొన్న ఔత్సాహికులు



రన్‌లో పాల్గొన్న చిన్నారులు



ప్లకార్డులతో విద్యుత్ శాఖ అధికారుల ప్రదర్శన

- వేల సంఖ్యలో పాల్గొన్న రన్నర్స్
- విజేతలకు నగదు బహుమతులు



బీచ్‌రోడ్డు: వైజాగ్ రన్నర్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సంధ్య మెరైన్స్ వైజాగ్ మారథాన్ ఉల్లాసంగా సాగింది. 21కె.10కే, 5కే , 3కే నాలుగు విభాగాల్లో నిర్వహించిన ఈ మారథాన్‌లో సుమారు 7 వేల మంది రన్నర్స్ పాల్గొన్నారు. కేవలం మన రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా రన్నర్స్ ఉత్సాహంగా పాల్గొన్నారు. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు ఎంతో ఉల్లాసంగా మారథాన్ చేశారు. దీంతో సాగరతీరంలో సందడి వాతావరణం నెలకుంది. ఉదయం 4 గంటల నుంచి 9 గంటల వరకు సాగిన ఈ మారథాన్‌లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు అన్ని రకాల ఏర్పాట్లను చేశారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు బాలకృష్ణారాయ్ మాట్లాడుతు వయోభేదం లేకుండా వేల సంఖ్యలో ఔత్సాహికులు పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా ఉండేందుకు, విశాఖ నగరం ప్లాస్టిక్ వ్యర్థాలను నిర్మూలించి పర్యావరణాన్ని కాపాడడంపై అవగాహన కల్పించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సంధ్య మెరైన్స్ డైరెక్టర్ ఆనంద్, వరుణ్ గ్రూప్ చైర్మన్ ప్రభకిషోర్, యూనియన్ బ్యాంక్ డీజీఎ నటరాజ్ తదితరులు పాల్గొన్నారు..

విజేతలు వీరే..

21కే పురుషుల విభాగంలో ఆర్.ఆర్.నాయక్, మహిళ విభాగంలో సౌమ్య సరస్వతి గెలిపొందారు. వీరికి నిర్వాహకులు రూ.40 వేలు, మెడల్, ట్రోఫీని అందజేశారు. రెండు మూడు స్థానాల్లో గెలుపొందిన వారికి రూ.30వేలు, రూ.20 వేలు అందజేశారు.అలాగే 10 కేలో పురుషుల విభాగంలో హరీష్, మహిళల విభాగంలో గ్రేస్ విజేతలుగా నిలిచారు. వీరికి రూ.15 వేలు, మెడల్, ట్రోఫీని అందజేశారు. రెండు, మూడు స్థానాల్లో వచ్చిన వారికి రూ.10వేలు రూ.7,500 అందజేశారు. వీరితో పాటు వివిధ విభాగాల్లో విజేతలను ప్రకటించి మొత్తం రూ. 5లక్షల విలువగల బహుమతులను అందజేశారు.

విద్యుత్ ఆదా చేయండి

మారథాన్‌లో విద్యుత్ ఆదాపై ఆ శాఖాధికారులు అవగాహన కల్పించారు. మారథాన్‌లో ప్లకార్డులను ప్రదర్శించారు.

సింహగిరిపై మోగిన నెలగంట



ఆలయ రాజగోపురంలో నెలగంట మోగిస్తున్న సిబ్బంది



ఆలయ బేడామండపంలో గోదాదేవికి తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు

- ఘనంగా ప్రారంభమైన ధనుర్మాస పూజలు
- రాజగోపురంలో నెలగంటను మోగించిన సిబ్బంది
- గోదాదేవికి విశేషంగా పూజలు, తిరువీధి

సింహాచలం: సింహగిరిపై ఆదివారం తెల్లవారుజామున నెలగంట మోగింది. నెల రోజులపాటు జరిగే ధనుర్మాస పూజలను శాస్త్రోక్తంగా ప్రారంభించారు. పాంచరాత్ర ఆగమశాస్త్రాన్ని అనుసరించి ఈ కార్యక్రమాన్ని అర్చకులు విశేషంగా నిర్వహించారు. ముందుగా శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను, గోదాదేవి అమ్మవారి ఉత్సవమూర్తిని, ఆళ్వారులను ఆస్థానమండపంలో వేదికపై అధిష్టింపజేశారు. ధనుర్మాస ప్రారంభ నివేదనం, తిరుప్పావై ప్రబంధ సేవాకాలం, ధను సంక్రమణ ప్రవేశ పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం గోదాదేవి అమ్మవారిని పల్లకీలో అధిష్టింపజేసి.. ఆలయ బేడామండపంలో ఘనంగా తీరువీధి నిర్వహించారు. గోదాదేవి సన్నిధిలో తొలి పాశుర విన్నపాన్ని పఠించారు. అనంతరం ఆలయ రాజగోపురంలో నెలగంటను శాస్త్రోక్తంగా మోగించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు శ్రీనివాసాచార్యులు, పురోహిత్ కరి సీతారామాచార్యులు, అర్చకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు రావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

దువ్వాడ మీదుగా ఎర్నాకుళం స్పెషల్ రైలు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఎర్నాకుళం-ధన్‌బాద్-ఎర్నాకుళం (వయా దువ్వాడ మీదుగా) మధ్య ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి ఓ ప్రకటనలో తెలిపారు. ఎర్నాకుళం-ధన్‌బాద్(06077) అన్ రిజర్వుడ్ స్పెషల్ రైలు ఈ నెల 18, 25 తేదీల్లో(సోమవారం) ఎర్నాకుళంలో ఉదయం 7.15 గంటలకు బయలుదేరుతుంది. మరుసటిరోజు మధ్యాహ్నం 12.08 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 12.10 గంటలకు బయల్దేరి తర్వాత రోజు ఉదయం 7.30 గంటలకు ధన్‌బాద్ చేరుకుంటుంది. ధన్‌బాద్-ఎర్నాకుళం (06078) అన్ రిజర్వుడ్ స్పెషల్ రైలు ఈ నెల 21, 28 తేదీల్లో(గురువారం) రాత్రి 11.55 గంటలకు ధన్‌బాద్‌లో బయలుదేరి మరుసటి రోజు రాత్రి 8.48 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది.

ఇక్కడ నుంచి 8.50 గంటలకు బయలుదేరి తర్వాత రోజు తెల్లవారు 2.30 గంటలకు ఎర్నాకుళం వెళ్తుంది. ఈ స్పెషల్ అలువ, త్రిస్సూర్, పాలక్కడ్, పోదునూర్, త్రిపూర్, ఈరోడ్, సేలం, జొలర్‌పేట, కాట్పడి, అరక్కోణం, పెరంబూర్, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, విజయవాడ, గుడివాడ, భీమవరం టౌన్, తణుకు, రాజమండ్రి, సామర్లకోట, తుని, అనకాపల్లి, దువ్వాడ, విజయనగరం, బొబ్బిలి, పార్వతీపురం, రాయగడ, మునిగుడ, అంబోడల, కేసింగ, టిట్లాగడ్, బాలంగీర్, బార్‌గడ్ రోడ్, సంబల్‌పూర్, జార్సుగుడ, రాజ్‌గన్‌పూర్, రూర్కెలా, నౌగావ్, హతియా, రాంచీ, మురి, బొకారో స్టేషన్లలో ఆగుతుంది.

జీసీసీ స్టాల్‌కు విశేష ఆదరణ



జీసీసీ స్టాల్‌ను సందర్శించిన అధికారులు, పూర్వ విద్యార్థులు

రాజవొమ్మంగి: స్థానిక అల్లూరి సీతారామరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గత రెండు రోజులుగా ఏర్పాటు చేసిన జీసీసీ ఉత్పత్తుల స్టాల్‌కు పట్టణ వాసుల నుంచి ఎంతో ఆదరణ లభించింది. పాఠశాల స్వర్ణోత్సవాల సందర్భంగా ఈ ప్రాంతానికి కుటుంబాలతో సహ వచ్చిన పూర్వ విద్యార్థులు, ప్రముఖులు ఈ స్టాల్ ఏర్పాటు చేయడం పట్ల ఆసక్తి కనపరిచారు. నాణ్యమైన తేనె, పసుపు, అరకు ఇన్‌స్టంట్ కాఫీ పౌడర్, నన్నారి షర్బత్ బాటిళ్లు, త్రిఫల్ చూర్ణం, త్రిఫల్ లిక్విడ్, హెర్బల్ పెయిన్ రిలీఫ్ బామ్, కుంకుడు కాయలు, అలోవీర సబ్బులు, షాంపులు, ఫోర్ క్లీనింగ్ లిక్విడ్, రాగి పౌడర్, రాజ్ మా గింజలు తదితర అటవీ ఉత్పత్తులు హాట్ కేకుల్లా అమ్ముడుపోయాయి. జీసీసీ డీఎం పార్వతీశ్వరరావు, సిబ్బంది పర్యవేక్షించారు.

రాళ్లగెడ్డలో మహిళ మృతదేహం లభ్యం



దేవి (ఫైల్)

హుకుంపేట : మండల కేంద్రంలో గల రాళ్లగెడ్డ వద్ద ఆదివారం మహిళ మృతదేహం లభ్యమైంది. పాడేరు కేంద్రానికి చెందిన ఎం.రవి(జీప్ మెకానిక్) భార్య అయిన దేవిగా గుర్తించినట్టు స్థానిక ఎస్ఐ సతీష్ తెలిపారు. ఆయన అందించిన వివరాల ప్రకారం కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ పూర్తిగా ఆరోగ్యం క్షీణించడంతో ఆమె మతిస్థిమితం సరిగ్గా లేకపోవడం వల్ల ఈ నెల 7వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఆమె భర్త, కుటుంబ సభ్యులు ఆమె కోసం వెతకడం ప్రారంభించారు. ఆమె ఆచూకీ తెలియకపోవడంతో పాడేరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆమె కనిపించకపోయిన 11రోజుల తరవాత ఆదివారం ఉదయం హుకుంపేట మండల కేంద్రం సమీపంలో గల రాళ్లగెడ్డ వద్ద శవమై పడి ఉండడాన్ని స్థానికులు గమనించారు. పోలీసులకు సమాచారం ఇచ్చారు. గెడ్డలో నుంచి మృతదేహాన్ని బయటికి తీసి పంచనామా నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించామని ఎస్ఐ తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

నలుగురిపై తూనికలు, కొలతల శాఖ కేసులు

నర్సీపట్నం: మండలంలోని పెదబొడ్డేపల్లి చేపలు, మాంసం దుకాణాలపై తునికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ డి.అనురాధ, తన సిబ్బందితో కలిసి ఆదివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తక్కువ తూకం తూస్తున్న ఇద్దరు చేపల వ్యాపారులపైనా కాటాలకు సీళ్లు వేయించని మరో ఇద్దరిపైనా కేసులు నమోదు చేశారు. మాంసం, చేపలు కొనుగోలు చేసిన వారికి తిరిగి తూకం వేయించి అప్పగించారు. తూకంలో మోసాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని ఇన్‌స్పెక్టర్ వ్యాపారులను హెచ్చరించారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్టు

నర్సీపట్నం: గంజాయి తరలిస్తున్న ముగ్గురు నిందితులను నర్సీపట్నం ఎస్ఈబీ పోలీసులు అరెస్టు చేశారని సీఐ శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. సీఐ వివరాల మేరకు... ముందస్తుగా అందిన సమాచారం మేరకు ఎస్సై చంద్రశేఖర్, సిబ్బందితో కలిసి నెల్లిమెట్ట వద్ద తనిఖీలు చేశారు. అక్కడ బైకుపై వస్తున్న నిందితుడిని తనిఖీ చేయడంతో 14 కిలోల గంజాయి దొరికింది. అతడిది మాకవరపాలెం మండలం సీతాన అగ్రహారానికి చెందిన పల్లా నాగరాజుగా విచారణలో అంగీకరించాడు. దీన్ని పాయకరావుపేటలో ఉంటున్న బాషాకు అప్పగించేందుకు తీసుకెళ్తున్నట్టు చెప్పాడు. ఆ మేరకు బాషాను అదుపులోకి తీసుకున్నారు. గంజాయి అమ్మిన జి.మాడుగుల మండలం వంజరి పంచాయతీ శివారు గేదెల బందకు చెందిన ఎం.నాగేశ్వరరావును అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు.

ఆరోగ్యశ్రీ పరిమితి రూ.25 లక్షలకు పెంపుపై హర్షం

మహారాణిపేట: వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.25 లక్షలకు పెంచడంపై ప్రజారోగ్య వేదిక హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి లేఖ రాసింది. గతంలో ఉన్న రూ.5 లక్షల పరిమితిని ఒక్కసారిగా రూ.25 లక్షలకు పెంచడం మంచి పరిణామని వేదిక ప్రధాన కార్యదర్శి టి.కామేశ్వరరావు లేఖలో పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ కేటాయింపుల వల్ల వైద్యారోగ్య శాఖ బడ్జెట్‌కు నష్టం జరగకుండా ప్రత్యేకమైన ఆరోగ్యశ్రీ బడ్జెట్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. గత సర్కారు కంటే ప్రస్తుత ప్రభుత్వం ఆరోగ్య సేవలను మెరుగుపరిచిన విషయం వాస్తమన్నారు. ఉద్దానంలో కిడ్నీ పరిశోధన కేంద్రాన్ని, మూత్ర పిండ వైద్య విభాగాన్ని ఏర్పాటు చేయడం అక్కడి ప్రజలకు ఎంతో ఉపయోగకరమని వేదిక అధ్యక్షుడు డాక్టర్ ఎం.వి. రమణయ్య తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో నెఫ్రాలజీ, న్యూరాలజీ విభాగాలను ఏర్పాటు చేయడం బాగుందన్నారు.

ఆరోగ్యం కోసం ఆర్గానిక్ వైపు..

- ప్రకృతి వ్యవసాయ పంటల ప్రాధాన్యం పెరిగింది
- ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి
- ముగిసిన విశాఖ ఆర్గానిక్ మేళా



చిన్నారుల శాస్త్రీయ నృత్యం



ఆర్గానిక్ మేళాలో పాల్గొన్న చిరంజీవి చౌదరి



వరికంకుల కుచ్చులను చూపుతున్న దాలి నాయుడు

ఏయూక్యాంపస్: ప్రకృతి వ్యవసాయ పంటల ప్రాధాన్యాన్ని ప్రజలు గుర్తించి.. వాటి ఉత్పత్తులను కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపడం ఆనందదాయకమని రాష్ట్ర ప్రభుత్వ మార్కెటింగ్, కో ఆపరేషన్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి అన్నారు. ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న నాలుగో విశాఖ ఆర్గానిక్ మేళా ఆదివారంతో ముగియగా.. చివరి రోజు మిద్దె తోటల సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఆరోగ్యంగా జీవించడానికి మంచి ఆహారం తీసుకోవాలన్నారు. ఆర్గానికమేళాను అద్భుతంగా నిర్వహించారని నిర్వాహకులను అభినందించారు. ఎకో వైజాగ్ స్ఫూర్తిని ప్రజలు స్వీకరించి.. విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీబీఐ విశ్రాంత జాయింట్ డైరెక్టర్ జె.డి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తాను కూడా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నట్లు చెప్పారు. ఇటువంటి ప్రకృతి ఆధారిత పంటల మేళాలను అన్ని జిల్లా కేంద్రాల్లో తరచూ నిర్వహించాలని కోరారు. అనంతరం మిద్దె పంటలపై మాధవి అవగాహన కల్పించారు. ఉత్తరాంధ్రలో ఉన్నతంగా మిద్దె తోటలు పెంచుతున్న ఆరుగురికి అవార్డులు ప్రదానం చేశారు. వీరిలో శ్రీకాకుళంనకు చెందిన తంగుడు సాయిరాం, విజయనగరానికి చెందిన కొండపల్లి వెంకటరావు, విశాఖకు చెందిన రాధారాణి అగర్వాల్, కిల్లి రాధ, అబిదున్నీసా, అనకాపల్లికి చెందిన పెంటకోట భాగ్యలక్ష్మి ఉన్నారు. వీరంతా తమ ఇంట్లో పెంచుకున్న మొక్కలతో ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో భాగంగా చిన్నారుల శాస్త్రీయ నృత్య ప్రదర్శన అలరించింది.

చివరిరోజు పోటెత్తిన జనం

ఆర్గానిక్ మేళాకు చివరి రోజు ప్రజలు పోటెత్తారు. మేళాను తిలకించడానికి, సేంద్రియ ఉత్పత్తులను కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపారు. మేళా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నర్సరీలో విభిన్నమైన మొక్కలను కొనుగోలు చేశారు. చిత్తూరులో తయారైన మట్టి పాత్రలను ఇక్కడ విక్రయించారు. తునికి చెందిన విశ్రాంత హిందీ ఉపాధ్యాయుడు పోలిపర్తి దాలినాయుడు తయారు చేసిన వరి కంకుల గుత్తులు మేళాలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భారత్ కిసాన్ సంఘ్ జాతీయ నాయకుడు జలగం కుమార స్వామి, ఆర్ఎస్ఎస్ రాష్ట్ర ప్రతినిధి జనార్ధన్, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పేరి రామకృష్ణ, ఆర్‌వైఎస్ఎస్ ప్రతినిధి కృష్ణారావు, గో ఆధారిత ప్రకృతి రైతు సంఘం అధ్యక్షుడు సుబ్రహ్మణ్య వర్మ, వ్యవసాయ శాస్త్రవేత్త అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.